మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# కృష్ణా జలాల హక్కుల కోసం సమరభేరి మోగిద్దాం...

**తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఢిల్లీకి తాకట్టు పెట్టిన కాంగ్రెస్...**

**జిల్లా వారిగా సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి..**

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** బి.ఆర్.యస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం నాడు నియోజకవర్గం సమీక్ష సమావేశంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అమలు చేయలేని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరు గ్యారెంటీలు అమలు చేసేవిధంగా ప్రజల తరపున బి.ఆర్.యస్ శ్రేణులు ఉద్యమించాలన్నారు. కేవలం 4లక్షలఓట్ల తేడాతో కె.సి.ఆర్ అధికారం కోల్పోయారని ఆయన ప్రతిష్ట పెంచే విధంగా మెజార్టిపార్లమెంట్ స్థానాలు గెలిచి కె.సి.ఆర్, బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కృష్ణా జలాలహక్కుల పరిరక్షణ కోసం ఛలోనల్గొండ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నియోజకవర్గం సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి..

**నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ స్వీకరించారు. బాధితుల నుండి 6 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్ట ప్రకారం పరిశీలించాల్సిందగా సిఐ, ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకువచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్‌లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజాసమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ నిరంతరం పనిచేస్తుందని, పోలీసు లు ప్రజల మన్ననలు పొందేవిధంగా విధులు నిర్వర్తించి వారికి సరైనన్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

# ప్రజావాణి ఫిర్యాదులను అన్ని శాఖల అధికారులు పరిష్కరించాలి..

**కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్**

**ఇటిక్యాల, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వంమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమ స్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి భూసమస్యలపై93, ఇతర సమస్యలకు సంబంధించి57, మొత్తం 150 దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో దరఖాస్తు దారులకు రిపోర్టు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదులను జిల్లా అధికారులు సంబంధిత మండలాల తహసిల్దార్లు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించి ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

# సబ్జెక్టు ఫోరం ప్రతినిధులకు కలెక్టర్ ప్రశంస

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ ఆధ్వర్యంలో సబ్జెక్టు ఫోరం ప్రతినిధులచే తయారు చేయబడిన బిట్ బ్యాంక్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ రవినాయక్ గుగులోత్ ఆవిష్కరించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లడుతూ పదవ తరగతి విద్యార్థులు సులువుగా అత్యధిక మార్కులు సాధించడానికి అలాగే భవిష్యత్తులో ఇతర పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఈ ప్రశ్నావళి ఉపయోగపడుతుందన్నారు. దీనిని స్వచ్ఛందంగా తయారు చేసిన సబ్జెక్టు ఫోరం ప్రతినిధులను దీనికి కారణ భూతమైన జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలో ఈ బిట్ బ్యాంక్ నుండి పదవ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తద్వారా విద్యార్థులు అందరూ వీటిని చదువుకోవడానికి అవకాశం ఉంటుంది ఏవైనా అనుమానాలు ఉంటే సంబంధిత సబ్జెక్టు టీచర్ల నుంచే వాటిని నివృత్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్ బైకాని, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, డిసిఇబి సెక్రెటరీ వెంకట్‌రాముడు, ఆయా సబ్జెక్టు ఫోరంల ప్రతినిధులు పాల్గొన్నారు.



బిట్ బ్యాంకును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్, డీఈఓ రవిందర్

# క్రీడారంగాలకు ప్రభుత్వం సహకరిస్తుంది..

**క్రీడలలో గెలుపోటములు సహజం**

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేసి సహకరిస్తుందని ఆడే ప్రతి ఆటలలో గెలుపోటములు సహజమేనని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరుగుతుందని జడ్పీ ఛైర్మన్ సరిత, ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాజీవ్‌గాంధి స్మారక ఇన్విటేషన్ క్రికెట్, టీఎస్‌పిఎల్ అయిజ క్రికెట్ టోర్నమెంట్లకు వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ సరిత, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బౌలింగ్ బ్యాటింగ్‌తో క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడ అనేది గ్రామాలకు అంకితం కాకుండా తాలూకా, జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో క్రీడారంగంలో రాణించాలని ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ క్రీడాకారులకు సూచించారు. గెలుపోటములు సహజమేనని భావించి క్రీడాకారులు ఆడాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేస్తామని సంపత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీఛైర్మన్ బండారి భాస్కర్, మధుసూదన్‌బాబు, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మన్ సరిత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

# పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వనపర్తి జిల్లా నుండి డీపీఓ, డిఆర్‌డిఓ , జడ్పీసీఈఓలకు బదిలీ చేస్తు ఉత్తర్వులు

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వనపర్తి జిల్లా నుండి డీపీఓ, డిఆర్‌డిఓ జడ్పీసీఈఓ లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. డిపిఓ సురేష్‌కు డిపిఓ సూర్యాపేటకు బదిలీ చేసి ఆయన స్థానంలో కనుమెట్ట రమణ మూర్తి మేడ్చల్ నుండి వనపర్తికి పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డిఆర్‌డిఓ నర్సింహులును మహబూబ్‌నగర్ డిఆర్‌డిఓగా బదిలీ చేసి ఆయన స్థానంలో జోగులాంబ గద్వాల్‌లో పనిచేస్తున్న పి.ఉమాదేవి ని డిఆర్డీవో గా బదిలీ చేశారు. వనపర్తి జడ్పిసిఈఓ గా మహబూబ్‌నగర్ నుండి యాదయ్యను నియమించారు. భద్రాద్రి కొత్తగూడెంలో డిప్యూటీ సిఈఓగా పనిచేస్తున్న పి.నాగేంద్ర ను వనపర్తి అడిషనల్ డిఆర్డీవోగా బదిలీపై వస్తున్నారు.

# ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

# కౌన్సిల్ ఇక ప్రజా సంక్షేమం కోరి పని చేస్తుంది..

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**వ్యక్తిగత విమర్శలు ఉండవు**

**చిల్లర రాజకీయాలు చేయదలుచుకోలేదు**

**కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు సమన్యాయం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఇకనుంచి కౌన్సిల్ సభ్యులు ప్రజా సంక్షేమం కోరి పని చేస్తారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదని, ప్రజా సంక్షేమం కోసం ఏనాడూ సమగ్రమైన చర్చ జరగలేదని, ప్రజల అవసరాలు తీర్చే ప్రయత్నం, మున్సిపాలిటీ కౌన్సిల్ పరిగణనలోకి తీసుకోలేదని, నామమాత్రంగా నడిచిందని, ప్రజల సమస్యల్ని గాలికి వదిలేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను అందరికి పరిచయం చేస్తూ ఆయన మాట్లాడారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. సోమవారం జరిగిన మహబూబ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కౌన్సిలర్లతో సహా వివిధ పార్టీల కౌన్సిలర్లు సహకరించారని, అందుకు సహకరించిన అన్ని పార్టీల కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఆనంద్‌గౌడ్‌కు అనుభవం కలిగి ఉన్నారని, ప్రజలకు సేవ చేయాలనే చిత్తశుద్ధి, పట్టుదల కలిగిన వ్యక్తి అని, కాంగ్రెస్ పార్టీ తరపున సోమవారం ఏకగ్రీవంగా మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారని, అలాగే గత మూడు పర్యాయాలు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ఎన్నికై ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి షబ్బీర్ అలీ, వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన కౌన్సిలర్లు ఇన్నాళ్లు ప్రజలకు ఏ విధమైన సేవ చేయలేకపోయారని, ఇకనుంచి అలాంటి పరిస్థితులు లేకుండా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కౌన్సిల్‌లో ప్రజల సమస్యలను కూలంకశంగా చర్చించి, ప్రతి వార్డులో పర్యటించి రోడ్, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు, వీధ దీపాలు ఏర్పాటు ఇంకా ప్రజలకు కావాల్సిన అనేక అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చేందుకు ప్రతి కౌన్సిల్ సభ్యుడు పని చేస్తారని ఆయన తెలిపారు. మార్పు కావాలని ప్రజలు కోరుకున్నారని, వారి అభీష్టం మేరకు ఆ మార్పుకోసం మహబూబ్‌నగర్ ప్రజల కోసం మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం వివిధ పార్టీలలో ఉన్నవారందరు కాంగ్రెస్ పార్టీ జెండా కిందకు ఈరోజు రావడం చాలా సంతోషదాయకమన్నారు. ఇప్పుడు ఉన్న కౌన్సిల్ ప్రజాశ్రేయస్సు కోసం, ప్రజా సమస్యలపై మాత్రమే మా సభ్యుల దృష్టి ఉంటుందని, సిద్ధాంత పరమైన విమర్శలు మాత్రమే ఉంటాయని, వ్యక్తిగత విమర్శలకు తావు ఉండదని ఆయన స్పష్టం చేశారు. పార్టీకతీతంగా ప్రతి మున్సిపల్ వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మన మహబూబ్‌నగర్ జిల్లా బిడ్డ కాబట్టి అధిక నిధులు మంజూరు చేయించి, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ ఛైర్మన్ షబ్బీర్ అలీ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



మున్సిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

# పదేళ్ల తర్వాత మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్...

**- వీర జవాన్ యాదయ్య**

**భార్యకు రెవెన్యూ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం...**

**- గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అందని ఉద్యోగం**

**- పీసీసీ సభ్యులు, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి**

అచ్చంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:దేశ సరిహద్దుల్లో దేశ రక్షణే ధ్యేయంగా పెట్టుకొని ఎండ, వాన, చలిని తట్టుకొని మంచు ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్మీ జవాన్ యాదయ్య ముష్కరుల దాడిలో 2013 జూలై నెలలో వీరమరణం పొందాడు. యాదయ్య వీరమరణం పొందడంతో అనాటి ప్రభుత్వం, ప్రతిపక్ష మాజీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, హాజరై వీర జవాన్ యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకొని అండగా ఉంటామని హామీ ఇచ్చారు కానీ ఆ హామీని నేరవేర్చడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీసీసీ సభ్యులు, వంగూరు జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి దుయ్యబట్టారు. అనాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లి గ్రామంలోని వీర జవాన్ యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుంచి అందే అన్ని సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారని కేవీఎన్‌రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 2 నెలల కాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి వీర జవాన్ యాదయ్య భార్యకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం కల్పించి నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా అందించారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ పాలకులు వీరజవాన్ యాదయ్య పేరిట కొండారెడ్డిపల్లి గ్రామంలో స్మారక గ్రంథాలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు కానీ ఆ హామీని నేరవేర్చడంలో నేటికి అలసత్వం వహిస్తునే ఉన్నారని ఆయన అన్నారు. వీరజవాన్ యాదయ్య కుటుంబానికి ఇచ్చిన హామీలను ఏ ఒక్క హామీ కూడా పదేళ్లు గడిచిన కూడా నేరవేర్చకపోవడంలో అంతార్యమేమిటని ఆయన ప్రశ్నించారు. గత పాలకులు స్వలాభాల కోసమే ప్రాకులాడారే తప్ప దేశ రక్షణ కోసం కుటుంబ సభ్యులను సైతం వదులుకొని సరిహద్దుల్లో ముష్కరుల దాడులను ఎదుర్కొని పోరాడి వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ల కుటుంబాలను ఆదుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమరవీర జవాన్ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే సదుపాయాలన్నింటిని కల్పించేందుకు సైనికుల సంక్షేమ సంఘం సభ్యులకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వీరజవాన్ యాదయ్య సతీమణి సుమతమ్మ చారకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. విలేకరుల సమావేశంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసాచారి, సెక్రటరి గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణయ్య, వీరజవాన్ యాదయ్య సతీమణి సుమతమ్మ, మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, మురళి, రాము తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యులు, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి



కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న వీరజవాన్ యాదయ్య సతీమణి సుమతమ్మ

# ఈవీఎంల మొదటి లెవల్ తనిఖీ..

**ప్రక్రియను పర్యవేక్షించిన జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్**



ఈవిఎంలు, వివి ప్యాట్‌లను మొదటి లెవల్ చెకింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఈవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ కొనసాగుతున్న ప్రక్రియను సోమవారం ఆ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ తనిఖీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరుగుతున్న ఎలక్ట్రానిక్ యంత్రాలకు మొదటి లెవల్ చెకింగ్‌ను ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, సుమారు 826 ఈవిఎంలు బ్యాలెట్ యూనిట్స్ 769 కంట్రోల్ యూనిట్స్, 930 వివి ప్యాట్స్ మొదటి లెవల్ చెకింగ్ పూర్తి చేయడం జరిగిందని, రెండు రోజుల్లో మిగిలిన ఈవిఎంల తనిఖీ పూర్తిచేయడం జరుగుతుందని అన్నారు. ఈసిఐఎల్ ఇంజనీర్ల 7 మంది బృందం ఆధ్వర్యంలో ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ఎఫ్‌ఎల్‌సి ముగిసిన వెంటనే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వీలుగా ర్యాండం పద్ధతిన మాక్‌పోల్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని, ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్‌తో పాటు తహసిల్దార్‌లు మంజుల, ధనుంజయ, నరేష్, చైతన్య, ఎన్నకల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఛైర్మన్‌పై దాడి హేయమైన చర్య..!

**- బాధితులను అరెస్ట్ చేసే వరకు ఉద్యమిస్తాం...**

**- ఆర్యవైశ్యుల రాస్తారోకో, ధర్నా...**

**- స్తంభించిన రాకపోకలు**

**అచ్చంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మార్కెట్ కమిటీ ఛైర్మన్ అరుణపై విచక్షణ రహితంగా అవమానపరుస్తూ మహిళా అని చూడకుండా బెదిరింపులకు పాల్పడుతూ చేసిన దాడి హేయమైన చర్య అని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విద్యాకమిటీ ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని వాసవీమాత దేవాలయంలో ఆర్యవైశ్యులందరు ఏకమై సమావేశాలు నిర్వహించి దాడికి పాల్పడిన వారిని శిక్షించాలంటూ సీఐ, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశారు. అనంతరం లింగాల చౌరస్తాలోని అంబేద్కర్ కూడలిలో నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విద్యాకమిటీ ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు మాట్లాడుతూ ఆర్యవైశ్య మహిళా ఛైర్మన్ పదవిలో కొనసాగడమే పాపమా!, పల్లీ ధరలను నిర్ణయించేది టెండర్ పాడిన వారు అయితే మహిళా ఛైర్మన్‌పై దాడికి పాల్పడటమేమిటని వారు ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికే ఛైర్మన్ మార్కెట్ యార్డ్‌లో రైతులతో పాటు కలిసి అక్కడే ఉన్న ఛైర్మన్‌కు టెండర్‌దారులు మా పొట్ట కొడుతూ గిట్టుబాటు ధర కల్పించడం లేదని వివరించాల్సింది పోయి ఛైర్మన్ అన్యాయం చేశారని ఆమెపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడటం సిగ్గుచేటుకరమని వారు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని నిర్వహించిన ధర్నా, రాస్తారోకో పెద్ద ఎత్తున సాగడంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడికి పాల్పడిన వారిని గుర్తించి శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా, రాస్తారోకోను విరమింపజేశారు. అచ్చంపేట పట్టణంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌పై జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్‌ను పాటించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు విసనకర్రల చంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక, జిల్లా అధ్యక్షురాలు పాపిశెట్టి సౌజన్య, ట్రెజరర్ సంధ్యారాణి, గుండ ప్రసన్న, జిల్లా పీఆర్‌ఓ మిర్యాల రాజయ్య, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, అచ్చంపేట, వంగూరు, వెల్దండ మండలాల అధ్యక్షులు ఆకుతోట లక్ష్మినారాయణ, మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు ఆర్యవైశ్యులు సత్యనారాయణ, వెంకటరమణ, కందికొండ శ్రీధర్, వినోద్, చిత్తనూరి శ్రీకాంత్, చిత్తనూరి కల్పన, పోలిశెట్టి సురేష్, వర్తక సంఘం అధ్యక్షులు కటకం ప్రకాష్, దర్శి సాయిరాజ్, వీరబొమ్ము కవిత, పెద్ది ప్రియాంక, మేడిశెట్టి అనూష, కామిశెట్టి శ్రీనివాస్, బిక్కుమాండ్ల వెంకటేష్, ఒరుగంటి సాయిరాం, అనుబంధాల సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.



నిందితులను అరెస్ట్ చేయాలని సీఐ రవీందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు



రాస్తారోకో నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విద్యాకమిటీ ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్

## పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుంది:ఎస్పి రక్షిత కె మూర్తి



**వనపర్తి టౌన్,ఫిబ్రవరి11,ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పి రక్షిత కె మూర్తి అన్నారు.వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్.పి రక్షిత కె మూర్తి,ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడం జరిగినది.సోమవారం రోజు జిల్లా నలుమూలల నుండి మొత్తం 7 ఫిర్యాది దారులు రావడం జరిగినది.

## మెగాస్టార్ చిరంజీవిని మర్యాద పూర్వకంగా కలిసిన వనపర్తి జిల్లా అధ్యక్షుడు నాగరాజు



**గోపాలపేట,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** మెగాస్టార్ చిరంజీవి నీ సోమవారం హైదరాబాద్ బ్లడ్ బ్యాంకులో మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.మెగాస్టార్ చిరంజీవి పద్మ విభూషణ్ అవార్డు పొందిన సందర్భంగా వనపర్తి జిల్లా మెగాస్టార్ అసోసియేషన్ తరపున హైదరాబాద్ లోని బ్లడ్ బ్యాంకులో చిరంజీవిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.మెగాస్టార్ చిరంజీవి మరెన్నో అవార్డులు ఉంది అంచలంచెలుగా ఎదగాలని వనపర్తి జిల్లా అధ్యక్షుడు నాగరాజు కోరారు. చిరంజీవిని కలిసిన సందర్భంగా వనపర్తి జిల్లా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు నాగరాజును అభినందించారు. చిరంజీవిని కలిసిన వారిలో ఎస్.టి.డి రాజు కార్తీక్ శివ శంకర్ లో ఉన్నారు

## జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఉద్యోగాలు భర్తీ

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ,వనపర్తి జిల్లాలో (4) ఎంఎల్‌హెచ్‌పి ఎస్ పోస్టులు జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద భర్తీ చేయడానికి అభ్యర్థులు ఏవైనా అభ్యంతరములు ఉన్నచో అప్లై చేసినారు కావున ప్రొవిజినల్ లిస్టును సరిచూసుకొని తేది : 13.02.2024 నుండి 14.02.2024 తారీకు వరకు అప్లికేషను తో పాటు సంబంధిత జిరాక్స్ సర్టిఫికెట్స్ తో పాటు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి,వనపర్తి జిల్లా కార్యాలయం లో ఇవ్వగలరు అన్ని మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె జయచంద్ర మోహన్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.గమనిక : మరిన్ని వివరాలకు చూడగలరు సంప్రదించాల్సిన ఫోన్ నం : 8639398082,8555802369

## కేంద్ర ప్రభుత్వం సూపర్ ఫైన్ రైస్ బియ్యం రేషన్ షాపులు ద్వారా పంపిణీ చేయండి

**కలెక్టర్‌కి బిజెపి వినతిపత్రం**



**వనపర్తి టౌన్ ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్‌కి కేంద్ర ప్రభుత్వం 29 రూపాయలకు కిలో బియ్యం సోనామసురూ సూపర్ ఫైన్‌రైస్ బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది. దానిలో భాగంగా వనపర్తిజిల్లా రేషన్ డీలర్లఅధ్యక్షులు ప్రజాపంపిణీ ద్వారా నిత్యము ప్రజలకు సేవ చేస్తున్న రేషన్‌షాపుల ద్వారా ఇవ్వవలసిందిగా కోరడం జరిగింది. ఎందుకనగా ప్రభుత్వం మారిన కష్టపడి పనిచేసే వారు రేషన్ డీలర్ ప్రజలకు నిత్యవసర సరుకులు ఇవ్వడం జరుగుతుంది. గతంలో మనకు కిరణ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు పస్తులు ఉండకూడదని రేషన్ బియ్యం సరఫరా చేయడం జరిగింది. మరి అదే విధంగా గతంలో ఉల్లిగడ్డలు టమాటలు రేషన్ షాపుల ద్వారా అమ్మ హస్తం కింద 9 రకాల వస్తువులు ఇవ్వడం జరిగింది. కాబట్టి కచ్చితంగా ప్రజలకు రేషన్‌షాప్ ద్వారా ఇవ్వడం కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటే రెడ్డి, శేష పని రాఘవేంద్ర, వనపర్తి డీలర్లు పాల్గొన్నారు.

## వైకల్య బాధితులకు ఫిజియోథెరపీ సేవలు..



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** వివిధ రకాల వైకల్యాలతో బాధపడుతున్న బాల బాలికలకు ఫిజియోథెరపి వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్‌పిలు తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకము సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బాధితులకు ఫిజియోథెరపి సేవలందించారు. జెనెటిక్ సమస్యలతో బాధపడుతున్న మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన సరిత 10 ఫిజియోథెరపి చేశారు.అదేవిధంగా సెరిబ్రల్ పాలసీతో బాధపడుతున్న కంసానిపల్లి తండాకు చెందిన యశ్వంత్‌కు ఫిజియోథెరపీ సేవలందించారు. మండలంలో ఆయా గ్రామాలలో ఆరుమంది చిన్నారులు వివిధరకాల వైకల్యాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని ఐఆఆర్పి టీచర్లు విజయ కుమార్, శివుడు తెలిపారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వారు వెల్లడించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం చదువులో వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా వైద్యసహాయం అవసరమైన పిల్లలకు మండల కేంద్రంలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో ఫిజియోథెరపిస్టు డా. కేశవులు, ఐఈఆర్‌పి టీచర్లు విజయకు మార్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె బంద్‌ను విజయవంతం చేయాలి...



**వంగూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు శివరాములు పిలుపునిచ్చారు. సోమవారం వంగూరు మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె బంద్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. 10 సంవత్సరాల బీజేపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశంలోని ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ బహుళ కంపెనీలకు అందజేస్తూ ప్రజల నడ్డి విరుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ జిల్లా సంఘం అధ్యక్షులు అంజయ్య, ఐకేపీ వీఓఎల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రామస్వామి, అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్స్ మండల ప్రధాన కార్యదర్శి శిరీష, మండల నాయకులు లక్ష్మమ్మ, వెంకటమ్మ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సభ్యులు రాఘవేందర్, బాల్‌నారాయణ, వెంకటయ్య, విష్ణు తదితరులు ఉన్నారు.

## కృష్ణా జలాలపై కాంగ్రెస్‌కు అవగాహన లేదు..!!

**- నేటి నల్గొండ కేసీఆర్ సభకు భారీగా తరలిరండి..**

**- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు,మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్**

**భూత్పూర్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** నీళ్లు,నిధుల కోసం ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ అవతరించి



కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నామని,ఇటీవల రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై తెలంగాణ ప్రాజెక్టులు,నీటి హక్కులను హరించే దిశగా కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అధికారాలు అప్పగించడం ద్వారా తెలంగాణ ప్రజలు కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు తీరని నష్టాల పాలౌతారని బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ అన్నారు.సోమవారం భూత్పూర్‌లో ఏర్పాటైన మీడియా సమావేశంలో బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ కృష్ణాజలాల వినియోగంపై అధికారాలు కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా జరిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు తమ పార్టీ అధినేత,బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం కేసీఆర్ ఈ నెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారని,ఈ సభకు ప్రతి గ్రామ,మండల,నియోజకవర్గ,జిల్లాల తెలంగాణ ప్రజలు,తెలంగాణ వారలు హాజరు కావాలని ఆయన కోరారు.మీడియా సమావేశంలో పార్టీ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,మేకల సత్యనారాయణ,సత్తూర్ అశోక్‌గౌడ్,మొహ్మద్ అహ్మద్, సత్తూర్ సురేష్‌గౌడ్,గడ్డం ప్రేమ్‌కుమార్,వడ్ల బ్రహ్మయ్య,సత్తూర్ రాకేష్‌గౌడ్,మాల విఠల్‌దాస్ వెంకటేష్,మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పబ్లిక్ ప్రాసిక్యూటర్ భక్షి చంద్రశేఖర్ రావుకు

## ప్రశంసా పత్రం అందజేసిన జిల్లా ఎస్పీ





**వనపర్తిటౌన్,ఫిబ్రవరి11,ప్రభాతవార్త:**వనపర్తి జిల్లా మదనాపురం పోలీస్ స్టేషన్ యొక్క అత్యాచార మరియు పిఓసిఎస్ఓ కేసులో నేం స్తుడైన మచ్చన్ షేక్ తండ్రి తచన్ షేక్,వయస్సు,48 సంవత్సరములు గ్రామం హల్సంపర,మండలం ముర్షిదాబాద్ జిల్లా 20సంవత్సరాల ఆరునెలలు కఠిన కారాగారశిక్ష మరియు 2000రూపాయల జరిమానాపడిన కేసులో వనపర్తిజిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ రావు కేసు యొక్క పరిశోధన చేసిన వనపర్తి డిఎస్పి ఆనంద రెడ్డి మరియు కోర్టు కానిస్టేబుల్ మన్యంకొండ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీవింగ్ అడిషనల్ డీజీపీ శిఖాగోయల్,ఐపీఎస్ ప్రశంసా పత్రాలు పంపనయినది ఇట్టి ప్రశంసా పత్రాలను వనపర్తి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భక్షీ చంద్రశేఖర్ రావుకి, మరియు మదనపురం కోర్టు కానిస్టేబుల్ మన్యం కొండకి ప్రశంసా పత్రాలను సోమవారం నాడు వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి,అందజేసి అభినందనలు తెలిపి నారు.కేసు యొక్క వివరాలు తెలుపుతూ తేదీ : 20.04.2022 నాడు ఫిర్యాదురాలు యొక్క కూతురుపై నేరస్థుడు చుట్టపక్కల ఎవరూ లేనిది గమనించి పాపను ఒక పాడుబడిన గదిలోకి తీసుకుని వెళ్లి శారీరకంగా హింసించి పాపతో అసభ్యంగా ప్రవర్తించి నానా ఇబ్బందులకు గురిచేసినాడని ఫిర్యాదురాలు దరఖాస్తు ఇవ్వగా అప్పటి ఎస్సై మంజునాథ్ రెడ్డి,కేసు నమోదు చేసి పరిశోధన పూర్తి చేసి పై నేరస్తుని అరెస్టు చేసి జ్యుడీషియల్ డిమాండ్ కు పంపించడం జరిగింది.తదుపరి పరిశోదన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినారు.ఆరోజు నుండి సోమవారం నాడు వరకు కేసు విచారణ జరిగింది ప్రిన్సిపల్ డిస్టిక్ మరియు సెషన్స్ జడ్జ్ వనపర్తి సునీత,ఇరువురి వాదనలు విన్న తర్వాత,సోమవారం నాడు నేరస్థుని పై నేరం రుజువైనందున 20 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార జైలు శిక్ష,2 వేల రూపాయల జరిమానా విధించారు. ఇట్టి కేసు లో వనపర్తి డిఎస్పి ఆనంద్ రెడ్డి,సాక్షులు మోటివేట్ చేయడం జరిగింది.నేరస్థునికి జైలు శిక్ష పడదానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి చంద్రశేఖర్ రావు,తన వాదనలు వినిపించారు,కానిస్టేబుళ్లు మన్యం కొండ సహకరించారు.

## 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి..

**సమ్మె పోస్టర్లను విడుదల చేసిన ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న**



16న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ హమాలి కార్మిక సంఘం నాయకులు

**ఇటిక్యాల ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దేశ సంపదను కార్పోరేట్లకు దోచిపెడుతున్న మోడీప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజావ్యతిరేక విధానాలకు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16వ తేదిన శుక్రవారం జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారిఆశన్న ఎలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని జింకలపల్లి స్టేజిలో హమాలి సమ్మె కు సంబంధించిన పోస్టర్లను ఆశన్న ఆధ్వర్యంలో విడుదల చేశారు.సందర్భంగా ఆశ న్న మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ పాలనలో పదేళ్లుగా అన్ని రంగా లలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు కార్మికులకు ఇచ్చిన హమీలు అమలు చేయడం లేదని మోసపూరిత హమీలను తిప్పికొట్టాలని కార్మికుల కు వేతనాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక విధానాలను వ్యతి రేకిస్తూ తలపెట్టిన 16 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు కలిసి విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మిక సంఘం నాయకులు పరుశురాముడు, పెద్ద నా గరాజు, వెంకటేష్, కిష్టన్న, నాగరాజు, సవారి, రాముడు, పెద్ద గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటలను పరిశీలించిన ఏ.ఓ చంద్రమౌళి..



పెబ్బేరు వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

**పెబ్బేరు,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పంటలను సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు కాండంతొలుచు పురుగు ఆశించిందని,సూక్ష్మదాతు పోషకాల లోపం ఉందన్నారు.వరి పంటకు పిలక దశలో కాండంతొలుచు ఆశించినప్పుడు వరి మొదల్లు సులువుగా ఊడొస్తుందని తెలిపారు.దీన్ని తీవ్రత ఎక్కువగా ఉంటే కంకి దశలో తెల్ల కంకులు ఏర్పడతాయని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణ ప్రక్రియలో భాగంగా ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లో రైడ్ 4జీ 8 కేజీలు,క్లోరాన్ ట్రనిలిప్రోల్ గుళికలు ఎకరాకు నాలుగు కేజీల చొప్పున 20 కేజీల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు.పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పై వాటితో పాటు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలని రైతులకు సూచించారు.సూక్ష్మదాతు లోప నివారణకు 250 గ్రాముల 20.20.20,అగ్రిమాక్స్ ప్రో 500 గ్రాములను పది రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ నరేష్,గ్రామ రైతులు బాలరాజు గౌడ్,వెంకట స్వామి,బలరాం,ప్రభాకర్ తదితర రైతులు పాల్గొన్నారు.

## జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** పదేళ్లలో ముఖ్యమంత్రిగా ఉండి ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ద్రోహం చేసిన కెసిఆర్ కృష్ణ జలాలపై నల్లగొండలో బహిరంగ సభ నిర్వహించడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎండి గౌస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణపేట జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి గౌస్ మాట్లాడుతూ కృష్ణ జలాలపై కెసిఆర్ మాట్లాడుతున్న తీరు చూస్తే దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. కెసిఆర్ గత పదేళ్లలో పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష చూపి ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల గడిచిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 40 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కృష్ణా జలాలను అక్రమంగా ఆంధ్రకు దోచిపెట్టాడన్నారు. పాలమూరు జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా అన్యాయం చేసిన కెసిఆర్ నేడు సిగ్గులేకుండా కృష్ణా జలాలు అందడం లేదంటూ బహిరంగ సభ పెట్టాడన్నారు.ప్రభుత్వం ఏర్పడిన అరవైరోజుల్లోనే పేట,కొడంగల్ ఎత్తిపోతల పథకా నికి నిధులు కేటాయించడం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమన్నారు.కార్యక్రమంలో మండలఅధ్యక్షుడు శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం (కౌన్సిలర్),జిల్లాగౌడ సంఘం అధ్యక్షులు మనోహర్‌ప్రసాద్,లిచ రఘుబాబు,యూసుఫ్,కళ్యాణ్‌కుమార్,రవినాయక్, నర్సింలుగౌడ్, పేరపళ్ల శంకర్, సాయిరెడ్డి, బోయిన్‌పల్లి రాములు, ఎరుకలి వెంకట్రాములు, రాము, అచల్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ సురేందర్‌కు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు..




సురేందర్‌కు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఆదివారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అండ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. యు. సుబ్రమణ్యం చేతుల మీదుగా కె. సురేందర్ (మక్తల్) ఎమ్మార్పీఎస్ కున్సీ క్రిష్ణ మండల ఉపాధ్యాయులు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు 2024 ను అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి అండ్ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అగడం వారు ప్రతిఏటా ప్రజా ఉద్యమకారులకు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలియజేశారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ,కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి ఈ అవార్డుకు ఎంపికవుతారని తెలియజేశారు. మన మక్తల్ ప్రాంతానికి చెందిన కె. సురేందర్ దాదాపుగా 40 సంవత్సరాల పాటు బోధన కొనసాగించి ఎంతో మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేశారు. ఈ ఉపాధ్యాయుని శిష్యులు ఎంతో మంది ఉపాధ్యాయ వృత్తిలోనూ, ఇతర రంగాల్లోనూ స్థిరపరడినారు. గతంలో ఈ ఉపాధ్యాయుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు, లైన్స్ క్లబ్ వారి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యయ అవార్డు అందుకోవడం జరిగింది. తమ గురువుకి ఈ నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు రావడం పట్ల చాలామంది విద్యార్థులు, మండల ఉపాధ్యాయులు, ఆత్మీయులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

### యాసంగి వరి పంటలో చౌడు సమస్య

## తీవ్రతను వల్లనే కృంగిపోతున్న వరి : ఏవో దాకేశ్వర్ గౌడ్



**వీపనగండ్ల,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** యాసంగి వరి పొలంలో చౌడు సమస్య వలన వరి పంటలు ఎదుగుదల లేక నాటిన మొదటి వారంలోనే ఎండిపోవడం పిలకలు రాక ఎదుగుదల లేకపోవడం జరుగుతుందని వీపనగండ్ల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ సూచిస్తున్నారు.ఆయన సోమవారం నాడు మండలంలోని గోపాల్ దీన్నే గోవర్దనగిరి గ్రామాలలో వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు.వరి నాటినటువంటి పొలంలో అరబెట్టడం మరియు జింకు సల్ఫేట్ స్ప్రే చేయడం లాంటి నివారణ చర్యలు రైతులు తీసుకోవాలని ఆయన సూచించారు. భూమిలో పోషక విలువలు తగిన మోతాదులో లేకపోవడం వల్ల సల్ఫైడ్ దుష్ప్రభావంవల్ల పంటలు ఎదుగుదల లేకపోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. మొక్కల ఎదుగుదల లేకపోవడానికి వివిధ రకాల కారణాలు ఉన్నా యని వరి పైరు ఎదుగుదలకు పోషక పదార్థాలు కలిగినటువంటి వాటిని స్ప్రే చేసినప్పుడే పొలంలో వాడినప్పుడే వరి మొక్క ఎదుగుదలక అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.వరిలో నీరు నిలువ ఉండకుండా చూడాల్సి నటువంటి బాధ్యత ఉందని ఆయన తెలిపారు.కలుపు తీయించడం లాంటి సమస్యలను అధిగమించినప్పుడే సల్ఫేట్ దుష్ప భవన్ తగ్గించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. అమ్మోనియా సల్ఫేట్ లాంటి ఎరువులను పొలంలో వాడకూడదని దీని నివారణకు 13045 లేదా 3గ్రాము గుళికలు జింకు కలిపి స్ప్రే చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు ఆయన చేయడం జరిగింది.యూరియా ఎకరాని కి 20 కేజీలు సాఫ్ 250 గ్రాములు కలిపి ఒక ఎకరాకి చల్లుకోవాలని వీటి ద్వారా కొంతమేరకు నివారణ చేపట్టవచ్చని ఆయన రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి శివ రైతులు ముంత చింతలయ్య వీర్ల రమేష్ గుంటి సురేష తదితరులు పాల్గొనడం జరిగింది.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి



**అలంపూర్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఐదవశక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాలను ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు అర్చకులు,ఈవోపురేందర్‌కుమార్ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి శేషవస్త్రం బహుకరించారు.అనిల్‌రావిపూడి పటాస్,సరిలేరు నీకెవ్వరు,ఎఫ్2,భగవంత్ కేసరి వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు.

## కొకుంట్ల గోశాలకు గోప్రేమికుడి విరాళం..

**- అభినందించిన గ్రామస్థులు**



**దేవరకద్ర,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కొకుంట్లలోని గోశాలకు సోమవారం ఓ గోప్రేమికుడు విరాళాన్ని అందజేశారు.వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన గోప్రేమికుడు బండారు బాలకృష్ణ రూ.10వేల నగదు విరాళాన్ని శ్రీ లక్ష్మీ గోశాలకు అందజేయాలని నిర్ణయించారు.అందులో భాగంగాను గోశాల నిర్వాహకులకు అట్టి విరాళాన్ని ఆయన అందజేశారు.ఈ సందర్భంగా బాలకృష్ణను గోశాల నిర్వాహకులతో పాటు గ్రామస్థులు అభినందించారు.

## ఆటోయూనియన్ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన యంపీపీ



**దేవరకద్ర,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం మండలంలోని శ్రీ వీరగురు ఆటోయూనియన్ సభ్యులకు యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, అధ్యక్షుడు కుర్వ రాముల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు రాము మాట్లాడుతూ యూనియన్‌లో దాదాపు 200కు పైగా సభ్యులున్నారన్నారు.అందరికి గుర్తింపు కార్డులను అందజేస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఆటోయూనియన్ సభ్యులు మల్లేశ్,శ్రీనివాసులు,చెన్నారెడ్డి,రాజు,బందిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్‌పై దాడిని ఖండించిన మండల బిఆర్ఎస్ నాయకులు




**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** అచ్చంపేట మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ అరుణపై ఆదివారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన దాడిని మండల బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వమే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తే ఈ సంఘటన జరిగేది కాదని అచ్చంపేట పాలశీతలీకరణ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న ట్రేడర్స్ కుమ్మక్కై రైతులకు అన్యాయం జరిగిందని భావించి దాడి చేయడం జరిగిందని, ఒక మహిళా ఛైర్‌పర్సన్ అని కూడా చూడకుండా ఆమెపై భౌతిక దాడులు చేయడం సరైంది కాదన్నారు. ఇది ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే దాడి జరిగిందని, ప్రజాపాలన పేరు చెప్పి ప్రజలకు నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ బలుస అరుణమ్మపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మేడమోని శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు పాత్కుల కురుమయ్య, ఎల్లయ్య యాదవ్, చిన్నజంగయ్య, సిహెచ్ సుధాకర్, సిహెచ్ మల్లయ్య, బాలస్వామి, బొల్లె మల్లయ్య, తాండ్ర శేఖర్ పాల్గొన్నారు.

## మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని క్షణికావేశంతో వ్యక్తి ఆత్మహత్య

**పెద్దమందడి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన ఆవుల సురేష్ 24 గ్రామంలోని కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత 4సంవత్సరాల నుండి మద్యానికి బానిసైన సురేష్ తరచుగా కుటుంబసభ్యులతో గొడవపడుతూ డబ్బులకోసం ఒత్తిడి తెచ్చేవాడు.మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకుంటే తాను చనిపోతానని బెదిరించేవాడు. అలాగే ఆదివారం సాయంత్రం మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్య తల్లిని అడగగా వారు డబ్బులు లేవని, మద్యం తాగవద్దని చెప్పడంతో సురేష్ క్షణికావేశంతో ఇంట్లోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్యమణి వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

**రెండు బైకులు ఢీకోని ఒకరికి తీవ్ర గాయాలు**

వనపర్తి మండలం కాశింనగర్ తాండకు చెందిన రాజు నాయక్ అనే వ్యక్తి తన కుమారుడు జల్లా ఘణపురం హాస్టల్‌లో చదువుతున్నాడు. ఆదివారం తన కుమారుడిని చూసివచ్చేందుకు భార్యతో కలిసి సైకిల్ మోటార్‌పై తిరుగు ప్రయాణంలో గ్రామానికి వస్తుండగా మార్గం మధ్యలో పామిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ దగ్గర ఎదురుగా వచ్చిన మరో సైకిల్ మోటార్ నడుపుతూ ఎదురుగా వచ్చిన సల్కెలాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు అతివేగంగా వచ్చి రాజు నాయక్‌ను ఢీకొట్టడంతో అతడికి రెండు చేతులకు బలమైన గాయాలయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## డోలారోహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి..

**భూత్పూర్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిట్లపల్లి శ్యాం సోదరుడి కుమార్తె డోలారోహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై చిన్నారిని దీవించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జెడ్పీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు


బాలాజీసింగ్ జన్మదిన వేడుకల్లో కల్వకుర్తి, వెల్దండ మండలాల నాయకులు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్‌లు బాలాజిసింగ్‌ను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించి ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మలిదశ ఉద్యమాన్ని నియోజకవర్గంలో అలు పెరుగని పోరాటం చేసి తెలంగాణ సాధించిన వారిలో బాలాజీసింగ్ గుర్తింపు సాధించారని వారు కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షాన్‌వాజ్‌ఖాన్, సతీష్, చిన్న రాంరెడ్డి, మోతిలాల్‌నాయక్, లింగారెడ్డి, పర్వత్‌రెడ్డి, శిశుపాల్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, కృష్ణ ముదిరాజ్, పోలేరాజు, రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

## ఉమ్రా యాత్రికులకు ఘన సన్మానం


ఉమ్రా యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ఘన సన్మానం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం స్థానిక జామ మస్జీద్‌లో ఉమ్రా యాత్రకు వెళ్తున్న హజరత్ మౌలానా షాహెబ్ దర్గా ముతవల్లి అలహాజ్ సాధిక్ పాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు హబీబ్ ఖాన్, జామ మస్జీద్ ఇమామ్ అబ్దుల్ హక్, మహమ్మద్ ఇబ్రహీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు హబీబ్, గౌస్, హఫీజ్, షాకేర్, సిద్దిక్, నజీర్, జిలానీ, సయిదా, ఫతెహ్ ముసావిరత్ కమిటీ భాధ్యులు తదితరులు ఉన్నారు.

## నల్గొండ బహిరంగ సభ పోస్టర్ విడుదల


నల్గొండ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన చలో నల్గొండ పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డిలతో పాటు పలువురు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు నల్గొండలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు రైతులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హన్మంత్‌నాయక్, నిరంజన్, ప్రభాకర్, హన్మంత్, శ్రీను, బాలకృష్ణ, రవిగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## క్రీడాకారుడిని అభినందించిన మాజీ సర్పంచ్


క్రీడాకారుడిని అభినందిస్తున్న మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి

**వెల్దండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** గత సంవత్సరం రింగ్ ఫైట్ అసోసియేషన్ వారు నిర్వహించినటువంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో వెల్దండ మండల కేంద్రానికి జంగిలి వంశీకృష్ణ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతాకాన్ని సాధించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో కర్నూల్ స్కంధహిల్స్‌లో నిర్వహించిన సమావేశంలో జంగిలి వంశీకృష్ణకు క్రీడాబిందు అవార్డును బహుకరించారు. క్రీడాబింధు అవార్డు అందుకున్న జంగిలి వంశీకృష్ణను వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, వైబీఆర్ యువసేన కోశాధికారి దాసరి బద్రీ, ప్రధాన కార్యదర్శి చందుతో పాటు తదితరులు ఉన్నారు.

## నిబంధనలు తప్పకుండా పాటించాలి

**వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**


ప్రైవేట్ ఆసుపత్రులు, రివ్యూ మీటింగులో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ప్రైవేట్ ఆసుపత్రులు, పరీక్ష కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010కు లోబడి ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఐడిఒసి కాన్ఫరెన్స్ హాల్లో ప్రైవేటు హస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఆరు ఆసుపత్రులు ఒక పరీక్ష కేంద్రం డయాగ్నోస్టిక్ సెంటర్‌కు దరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేసింది. అమ్మ హస్పిటల్ వనపర్తి, రెన్యువల్ , లక్ష్మి మహాదేవ్ హస్పిటల్ పెబ్బేరు, లక్ష్మి నరసింహ, క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ ఘనపూర్, ప్రసన్న పాలిక్లినిక్ వనపర్తి, మైక్రో ల్యాబ్ డయాగ్నోస్టిక్ సెంటర్ వనపర్తి, ఆయార పాలి క్లినిక్ వనపర్తి, ఆదిత్య చిన్నపిల్లల ఆసుపత్రి ఆత్మకూరు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అమ్మ హస్పిటల్ గడువు తీరిన బయో మెడికల్ వేస్టేజ్ ధృవీకరణ పత్రం సమర్పించడంతో కమిటీ పెండింగులో పెట్టింది. ప్రసన్న పాలిక్లినిక్ వనపర్తి సైతం సరైన డా.సిబ్బంది లేరని పెండింగులో పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు నిబంధనలకు తుచ తప్పకుండా పాటించాలని, సకాలంలో రెన్యువల్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, పట్టణం సిఐ నాగభూషణ రావు, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇటిక్యాల నూతన ఎస్సైని కలిసిన హనుమాన్ యూత్ సభ్యులు



**ఇటిక్యాల ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ఇటిక్యాల మండల నూతన ఎస్సైగా వెంకటేశ్ యాదవ్ ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో సోమవారం మర్యాద పూర్వకంగా ఎర్రవల్లి హనుమాన్ యూత్ సభ్యులు కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

**-కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవద్దు : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**కల్వకుర్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై, సాగునీటి ప్రాజెక్టుల ఆక్రమణలపై పోరాటాలకు సిద్ధం కావాలని, కార్యకర్తలు మనో ధైర్యాన్ని కోల్పోవద్దని, పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను, ఓటమికి వైఫల్యాలు, పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవులు ఇవ్వాలని, ఎక్కడ అయిన కార్యకర్తలకు ఇబ్బంది వస్తే అధిష్టానం వెంటనే స్పందించాలన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అసత్య ఆరోపణలు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిందని, త్వరలోనే ప్రజలు తిరగబడుతారని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా తీర్పును కాంగ్రెస్ చవిచూస్తుందని జోస్యం చెప్పారు. నేడు నల్గొండ జిల్లాలో కృష్ణ జలాల నీటి వాటా ఆక్రమణపై పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ చేపట్టే బహిరంగ సభ చేపడుతున్నారని, బహిరంగ సభకు జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పాలమూరు జిల్లాలో కూడా బహిరంగ సభ నిర్వహించేందుకు కార్యచరణ చేపడుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలతో కలిసి మెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల పదవి విరమణ పొందిన ప్రజా ప్రతినిధులను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి మెమెంటోలను బహుకరించారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## బహిరంగ సభను విజయవంతం చేద్దాం : బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్



**రాజాపూర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నల్గొండ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేద్దామని రాజాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బంగారి వెంకటేష్ అన్నారు. నేడు నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నదీ జలాల హక్కులను కాపాడుదామని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా. సి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రాజాపూర్ మండలం నుండి బహిరంగ సభను విజయవంతం చేయడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో తరలి రావాలని రాజాపూర్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బంగారి వెంకటేష్ కోరారు.

# యాంత్రీకరణ వ్యవసాయం లాభదాయకం

**● ఏడిఆర్ డాక్టర్ ఎం. మల్లారెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న ఏడిఆర్ డా.ఎం.మల్లారెడ్డి

**బిజినేపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** రెట్టింపైన మెట్టపంటల సాగులో కూలీల సమస్యకు యాంత్రీకరణ శాశ్వత పరిష్కారం అని ఏడిఆర్ డా. ఎం. మల్లారెడ్డి అన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రాల విభాగం హైదరాబాద్ సహకారంతో వ్యవసాయ పనిముట్ల యంత్రాల మేళ సోమవారం నిర్వహించారు. డా. ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగంలో మహర్దశ చోటు చేసుకుందని ఈ సమయంలో యాంత్రీకరణకు పెద పీట వేస్తేనే కూలీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సకాలంలో పంటలు వేయడం మొదలు కోతలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగి రైతులు నష్టాలు, కష్టాల బారి నుండి విముక్తి అవుతారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలపైన ఆధారపడే పరిస్థితి ఉందని, కూలీల కొరతతో అనుకున్న సమయంలో పంటలు వేయలేక సకాలంలో కోతలు చేపట్టలేక తీవ్రంగా నష్టపోయిన సందర్భాలు లేకపోలేదన్నారు. కూలీల కొరతను అధిగమించడానికి పంట విత్తిన దగ్గర నుండి కోసే వరకు వివిధ పంటలకు అవసరమయ్యే అధునాతన వ్యవసాయ యంత్రాలు వాటి సాంకేతిక పరిజ్ఞానంపై అందుబాటులో ఉన్న సేవలపై రైతులకు వివరించారు. వ్యవసాయ యంత్రాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్. రాజయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన పత్తి విత్తేయంత్రం వేరుశనగ తోవే యంత్రం, నేరుగా విత్తే వరి యంత్రం చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులో ఉండే విధంగా పవర్ విడర్, టిల్లర్ లాంటి అంతర్ కృషి పరికరాల గురించి వివరించారు. కెవికె కోఆర్డినేటర్ డా.టి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి వరిపంట కోసిన తర్వాత మిగిలిపోయిన కొయ్యలను కట్టెలను ముక్కలుగా చేసి నేలలో కలిపే గ్రిడర్ మల్చర్ యంత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ పుష్పావతి, శ్రవణ్ కెవికె శాస్త్రవేత్తలు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.


సమావేశానికి హాజరైన రైతులు, అధికారులు

# వైభవంగా ధ్వజారోహణం, గరుడ పూజలు


ధ్వజారోహణం గరుడ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** పాలెం వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు దేవాలయంలో ధ్వజారోహణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, శ్రీ స్వామివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోరవి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణ మధ్య ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు గరుడస్వామి వారిని పూజించిన ఆరాధించిన గ్రహదోష పరిహారం చెంది సంతానం ప్రాప్తిస్తుందని అన్నారు. సంతానం కాని దంపతులకు గరుడప్రసాద వితరణచేశారు. మధ్యాహ్నం శ్రీవారి పల్లకిసేవ కార్యక్రమం, దేవాలయ ప్రాంగణం నుండి ప్రధాన వీధుల గుండా రచ్చకట్ట వరకు నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రంగారావు, గంధం వెంకటేష్, భక్తులు, సేవాపరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గరుడ ప్రసాదం స్వీకరించిన దంపతులను వేద పండితులు విజయ రాఘవ చార్యులు, జయంత్, శుక్లా, శ్రీనివాసచార్యులు ప్రత్యేకంగా వేద ఆశీర్వచనాలు అందజేశారు. మంగళవారం దేవాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర స్వామి సుప్రభాత పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్పార్చన కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆలయ చైర్మన్ భక్తులకు అన్నప్రసాద పంపిణీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రంగారావు, కమిటి సభ్యులు బాలస్వామి, గంధం వెంకటేష్, ఆలయ సిబ్బంది బాబయ్య, ఆలయ సేవకులు జగదీష్, శేఖర్, లోకేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**● వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**


ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఐడిఓసి ప్రజావాణి హాల్లో ఆర్డీవో పద్మావతి, జడ్పిసిఈఓ రామ మహేశ్వర రెడ్డితో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా వెనువెంటనే పరిష్కరించే ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 60 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటి కార్యదర్శి ఖాజా ఖుతుబుద్దీన్ చేసిన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ కొనియాడారు. తహసీల్దార్‌గా ఉద్యోగ విరమణ చేసి అప్పటి నుండి ఉమ్మడి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా తన సేవలు కొనసాగించారు. వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శిగా తన సేవలు సుదీర్ఘకాలం అందించారు. సోమవారం ఉదయం ప్రజావాణి ప్రారంభం కాక ముందు ఉద్యోగులు అందరు కుతుబుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనంపాటించారు. ప్రజావాణి అనంతర కుతూబుద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటి సభ్యులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# గోరంట్ల ఆంజనేయులుకు డాక్టరేట్


ఆంజనేయులుకు అభినందిస్తున్న పీయూ వీసీ, అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో గత దశాబ్ద కాలంగా అధ్యాపకుడిగా సేవలందిస్తున్న గోరంట్ల ఆంజనేయులు డాక్టరేట్ పొందారు. ఆంజనేయులు ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కిష్టన్న కుమారుడు. కిష్టన్న దర్జీ పనులు చేస్తూ ఆంజనేయులును ఉన్నత చదువులు చదివించాడు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ మహబూబ్‌నగర్‌లోనేయ పూర్తి చేశాడు. ఎంఈడీ శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ నుంచి పూర్తి చేశాడు. సెట్, నెట్ పరీక్షల్లోనూ సత్తా చాటాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ ఏ రామకృష్ణ పర్యవేక్షణలో ఖ ఏ స్టడీ ఆఫ్ ప్రొఫెష్నలిజం అమాంగ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి పట్టా పొందాడు. అనేక జర్నల్స్‌లో విద్యా విధానం, మనో విజ్ఞాన విషయాలపై తెలుగు ఇంగ్లీష్ భాషల్లో వ్యాసాలు ప్రచురించారు. ఎన్ఈపీ–2020 చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా.బషీర్ అహ్మద్, హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్ మెంట్ డా.జంగంవిశ్వనాథ్, డాభూమయ్య, పీఆర్ఓడారవికుమార్, డాకరుణాకర్ రెడ్డి, వినోద్‌కుమార్, డావిజయలక్ష్మి, జయనాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

## 16న నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరణ అనంతరం రైతులు తెచ్చిన వేరుశనగను పరిశీలిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి అచల భారత కిసాన్ సభ అధ్యక్షులు చిలుక బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రైతులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర, సరైన తుఖాలు, సౌకర్యాలు ఎలా ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగాఅన్ని కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌లో కార్మిక రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఎపీ మల్లయ్య, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు**


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిల్లాలో వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌కు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందిచారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ జిల్లాలో ఏ మార్కెట్‌లో కూడా రైతాంగానికి గిట్టుబాటు ధర రావడం లేదని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలనిడిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో కమిషన్ దారులు, ట్రేడర్స్ మార్కెట్ అధికారులతో కుమ్మక్కై ధరలను నియంత్రిస్తున్నారని, అందువల్లే రైతాంగానికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని మార్కెట్ యార్డ్‌లను సందర్శించి రైతాంగాన్ని ఆదుకోవాలని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో ధర లేకపోతే రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని, వీటిని జిల్లా కలెక్టర్ నివారించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ఆర్.శ్రీనివాస్, కే.గీత, జిల్లా నాయకులు అశోక్‌లు పాల్గొన్నారు.

## దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దివిటిపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.కురుమూర్తి సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలోని 25 కాలనీ 664 నంబర్ వరుసలో నెల రోజుల నుంచి మంచినీళ్లు రాక కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాలనీలోని మంచినీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం చేయలేదని చెప్పారు. కొన్ని కాలనీలో మాత్రమే నీళ్లు వస్తున్నా, ఎత్తుగా ఉన్న ప్రాంతంలో మంచినీళ్లు రావడం లేదని వివరించారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు దివిటిపల్లి రైల్వే స్టేషన్ నుండి డబుల్ రూమ్‌లోకి వెళ్లేదారి పూర్తిగా గుంతలు పడిందని ఫలితంగా దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రోడ్డు పునరుద్ధరణ చేయాలని రైల్వే వంతెన కింద లైట్లు అమర్చాలని కోరారు.

## నూతన ఎస్సై పబ్బతి రమేష్‌కు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కారం



**చిన్నంబావి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పబ్బతి రమేష్‌ను సోమ వారం చిన్నంబావి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ మండల పరిధి లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రెస్‌క్లబ్ సభ్యులందరూ పూర్తిగా సహక రించాలని మండలాన్ని ప్రశాంత వాతావరణం కల్పించాలని అన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులు, పోలీసులపై ప్రజలుఎంతో నమ్మకాన్ని కలిగిఉంటారని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనిఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు నాగరాజు, తిరుపతి, వెంకటేష్, శ్యాంప్రసాద్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**రాజాపూర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలో గల దుందుభి వాగులో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తుండగా పోలీసులు రంగ ప్రవేశం చేసి రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని దుందుభి వాగులో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇసుకను ట్రాక్టర్‌లో నింపేందుకు ఉపయోగిస్తున్న జెసిబితో దుండగు పారిపోయినట్లు తెలిపారు. ఈ ట్రాక్టర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

## మృతుడి కుటుంబానికి చేదోడు



**కొల్లాపూర్, ఫిబ్రవరి 12 ప్రభా తవార్త:** మండలంలోని యన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ వాకిటి శ్రీనివాసులు కుటుంబానికి పదవ తరగతి పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఆర్థిక సహాయం చేశారు. గత 11 రోజుల క్రితం అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న 2004,04 పదవ తరగతి పూర్వ విద్యార్థులు చిన్నప్పటి నుండి తమతో కలిసి చదువున్న వాకిటి శ్రీనివాసులు కుమారుడు వాకిటి వెంకటేశ్వర్లును కలిసి రూ. 23 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తమతో కలిసి చదవుకున్న చిన్న నాటి మిత్రులు వాకిటి వెంకటేశ్వర్లుకు అండగా నిలిచారు. 2003,04 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఎవరికి ఏ ఆపద వచ్చిన ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాలె రాజేందర్ గౌడ్, జి. పెద్ద మల్లయ్య, బివిని పురుషోత్తం, అనుకలి రాజశేఖర్, పుట్ట రాంబాబు పాల్గొన్నారు.

# పాలమూరు 'హస్త'గతం

● చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా షబ్బీర్ అలీ
● బలనిరూపణలో 49మందికి 33మంది సభ్యుల మద్దతు
● చైర్మన్‌కు పోటీలో నిలిచిన కోరమోని వనజ

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి12, ప్రభాతవార్త:** ఎట్టకేలకు మహబూబ్ నగర్ మున్సిపాలిటీ కాంగ్రెస్‌కు చేజిక్కింది. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్నది. కొన్నిరోజుల కిందట మాజీ చైర్మన్ కేసీ నర్సింహులుపై అవిశ్వాసం పెట్టి కాంగ్రెస్ పార్టీ పంతం నెగ్గించుకున్నది. ఈమేరకు సోమవారం నిర్వహించిన బల నిరూపణలో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని మొత్తం 49 మంది సభ్యులకు గతంలో కేవలం 5మంది సభ్యులు మాత్రమే కాంగ్రెస్ పార్టీ వారు గెలుపొందారు.అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన ఆనంద్ గౌడ్ మెజార్టీ సభ్యులతో కలిసి కాంగ్రెస్‌లోకి చేరారు. దీంతో బలనిరూపణలో 33మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు తెలుపడంతో చైర్మన్‌గా ఆనందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. 10నెలలపాటు చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్ కొనసాగనున్నారు. వైస్ చైర్మన్‌గా షబ్బీర్ అలీ ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. చైర్మన్ ఎన్నికలో బీజేపీ సభ్యులు ఎవరికి మద్దతు ఇవ్వలేదు. అయితే చైర్మన్ పదవీకి కోరమోని వనజ పోటీకి నిలిచినా మెజార్టీ లేకపోవడంతో చైర్మన్ పదవీ దక్కలేదు. వైస్ చైర్మన్ ఎన్నికకు ఒమర్, షబ్బీర్ అలీ,మొయిన్ అలీ మధ్య పోటీ నెలకొనడంతో కొంత సేపు ఉత్కంఠ నెలకొన్నది. అయితే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వారి మధ్యసయోధ్య కుదుర్చి షబ్బీర్ అలీని ఎన్నుకున్నారు. గతంలో చైర్మన్ ఆనంద్ గౌడ్ తండ్రి దామోదర్‌గౌడ్ గతంలో మహబూబ్‌నగర్ మున్సి పాలిటీలో 1981లో కేవలం రూ.160కు కాంట్రాక్ట్ ఉద్యోగిగా జాయిన్ అయిన ఆయన సీనియర్ అసిస్టెంట్‌గా రిటైర్డ్ అయ్యారు. అయితే ఒకప్పుడు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ఓచిన్న ఉద్యోగంతో జీవనం సాగించిన ఆ కుటుంబం నుంచి వచ్చిన దామోదర్‌గౌడ్ కుమారుడు ఆనంద్‌గౌడ్ నేడు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నికవడంతో ఆ కుంటుంబ సభ్యులు సంతోషంలో మునిగితేలుతున్నారు.



చైర్మన్ ఆనందర్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## ఎక్లాస్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో బోర్ డ్రిల్లింగ్



**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చాలని, అదేవిధంగా జాతరకు వచ్చే భక్తులకు నీటి కొరత లేకుండా చూడాలని గ్రామస్తులు నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డిని కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కోటాలో బోరు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. సోమవారం తిమ్మప్పస్వామి దేవాలయం దగ్గర బోర్‌డ్రిల్ చేశారు. మాజీ ఎంపిపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివారెడ్డి, ఎండి గౌస్, రాములు,సాయిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉశప్ప, అశోక్, లక్ష్మణ్, బాలకిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో 6 క్వింటాళ్ల పిడిఎస్ రైతు పట్టివేత



**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దోరేపల్లి గ్రామంలో షేక్‌బాబా అనే వ్యక్తి చుట్టు పక్కల ఇళ్లలో పిడిఎస్ రైస్ సేకరించితన ఇంట్లో అక్రమంగా 6క్వింటాళ్ల పిడిఎస్ రైస్ నిల్వ ఉంచినందున పక్కాసమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులునిర్వహించి పట్టుకుని పోలీస్ స్టేషన్లలోఅప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా మద్దూరు ఎఎస్సై ఉస్మాన్ మాట్లాడుతూ డిటి పంచనామా అనంతరం షేక్ బాబాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్

### గుజరాత్ క్రీడాకారులకు కలెక్టర్‌చే క్రీడా దుస్తుల పంపిణీ



**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించే 19వ జాతీయస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక కాబడిన క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. అలాగే జాతీయ స్థాయిలోమన జిల్లాకు మెడల్స్,మంచి పేరుప్రతిష్టను తీసుకురావాలని క్రీడాకారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, డీఈఓ అబ్దుల్ గని, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నర్సిం హులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హారికదేవి, భరత్, ఫుట్‌బాల్ కోచ్ శ్రీలత, పీఈటిలు రాకేష్, నవీన్, అజిత్‌కుమార్, రమణమ్మ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ సభకు భారీగా తరలిరండి

**భూత్పూర్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** నీళ్లు,నిధుల కోసం ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ అవతరించి కొట్లాడి తెలంగాణను తెచ్చుకు న్నామని,ఇటీవల రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై తెలం గాణ ప్రాజెక్టులు,నీటి హక్కులను హరించే దిశగా కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అధికారాలు అప్పగించడం ద్వారా తెలంగాణ ప్రజ లు కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు తీరని నష్టాల పాలౌతా రని బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ చైర్మన్‌సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. సోమవారం భూత్పూర్‌లో ఏర్పాటైన మీడియా సమావేశంలో బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ కృష్ణాజలాల వినియోగంపై అధికారాలు కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా జరిగే దుష్ఫరిణామాలను ప్రజలకు వివరించేందుకు తమ పార్టీ అధినేత,బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం కేసీఆర్ ఈనెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారని, ఈ సభకు ప్రతి గ్రామ,మండల,నియోజకవర్గ,జిల్లాల తెలంగాణ ప్రజలు, తెలంగాణ వారులు హాజరుకావాలని ఆయనకోరారు.మీడియా సమావేశంలో పార్టీ నాయకులు సత్తూర్ నారాయ ణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,మేకల సత్యనారాయణ,సత్తూర్ అశోక్‌గౌడ్,మొహ్మద్ ఆహ్మద్, సత్తూర్ సురేష గౌడ్,గడ్డం ప్రేమ్‌కుమార్,వడ్ల బ్రహ్మయ్య,సత్తూర్ రాకేష్‌గౌడ్,మాల విఠల్‌దాస్ వెంకటేష్,మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శాంతికుమార్‌కే ఎంపీ టికెట్ కేటాయించాలి

### - ఓబీసీ ప్రతినిధులు డిమాండ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ టికెట్ బీసీ నాయకుడు అయిన బండారి శాంతికుమార్‌కే కేటాయించాలని జడ్చర్ల నియోజకవర్గ ఓబీసీ ప్రతినిధులు కోరారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జనాభాల్లో 65శాతం పైగా బీసీలకు రాజకీయాల్లో కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగిస్తున్నారు తప్పా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయనివ్వడం లేదని వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్మగౌరవ , ఐక్యత నినాదంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు కూడా మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్ బీసీల అభ్యర్థికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం కోట్ల కిషోర్, యువత అధ్యక్షుడు టంకరి శివప్రసాద్,ముదిరాజ్ , ఓబీసీ సంఘం నాయకులు చెన్నయ్య, లక్ష్మీదేవి, చంద్రకాంత్‌యాదవ్, సాయికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో నిర్వహిస్తున్న ఓబీసీ ప్రతినిధులు

## కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ భారత్ బంద్

● ఢిల్లీలో నేడు జరిగే నిరసనకు స్వేచ్ఛ వాతావరణం కల్పించాలి
● తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు

**చిన్నంబావి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే సమ్మె గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, ఆదివాసీలు పాల్గొని జయప్రదం చేయాని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చాఆధ్వర్యంలో ఢిల్లీలో నేడు జరిగే నిరసనను జరగనివ్వకుండా ఢిల్లీ సరిహద్దులలో బారీ కేడ్లను, ముళ్లకంచెలను వేలాది పోలీసులను ఏర్పాటు చేసి నిరసనను అడ్డుకుంటున్న సరిహద్దు రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నేడు జరిగే నిరసనకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుజక్కులవెంకటయ్య, రాష్ట్ర నాయకులు బుచ్చారెడ్డి, రైతు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఎంపిడిఓలను సన్మానించిన కలెక్టర్



బదిలీపై ఎంపిడిఓలను సన్మానించిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న ఎంపిడిఓలను కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సన్మానించి అభినందించారు. ఇన్ని రోజులు నారాయణపేట జిల్లాలో పనిచేసి విధి నిర్వహణలో చిత్తశుద్ధి కనబర్చి జిల్లా అభివృద్ధిలోభాగస్వాములు అయ్యారని,ఇదే తరహాలో ఇతర జిల్లాలోనూ విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవా లని, ఎంపిడిఓలకు ఈసందర్భంగాకలెక్టర్‌సూచించారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన ఎంపిడిఓలబదిలీల ప్రక్రియలో భాగంగా నారాయణపేట జిల్లా నుంచి మహబూబ్‌నగర్ జిల్లాకు నలుగురు, వనపర్తి జిల్లాకు ఒకరు, జోగులాంబ గద్వాలజిల్లాకు ఒకరు, సిద్ధిపేట జిల్లాకుఒక ఎంపిడిఓ బదిలీఅయ్యారు.అదే విధంగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డిఆర్‌డిఎ గోపాల్‌నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో జిల్లా అద నపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జడ్పీ డిప్యూటి సీఈఓ జ్యోతి పాల్గొన్నారు.

# సిండికేట్ దందా..

- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు
- అన్ని ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే
- బాటిల్‌పై రూ.5,10,15 అధికంగా అమ్మకం
- మాముళ్లుకు నోరుమెదపని అధికారులు
- మందుబాబుల జేబులకు చిల్లులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** వైన్ షాపుల సిండికేట్ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది. మండల కేంద్రాల్లో రెండు, మూడు వైన్ షాపులు ఉన్నచోట సిండికేట్ అయి అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ముందుగానే సిండికేట్ అయి ఒక్కో బాటిల్‌పై రూ.5 నుంచి రూ.15 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ప్రతి నెలా మాముళ్ల పేరుతో ఎక్సైజ్ శాఖ అధికారులకు డబ్బులు అందజేస్తూ తమ దందాను నడిపిస్తున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం దందా మూడు బీర్లు..ఆరు విస్కీలు అనే చందంగా సాగుతున్నది. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ కాదు.. తక్కువ అమ్మినా నిబంధనలకు విరుద్ధం. అయినా ఇవేవి తమకు పట్టవంటూ వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంనాలుగు డివిజన్లుమహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి,గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లున్నాయి.

**మండల దుకాణాల్లో అధిక ధరలు..** ఉమ్మడి జిల్లాలో చాలా మండలాల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. రాజాపూర్, నర్వ, అమరచింత,అడ్డాకుల ఇలా చాలా మండలాల్లో ఎమ్మార్పీ ధరకంటే రూ.5 అదనంగా అయితే ముందుగానే అంతా కలిసి మాట్లాడుకొని ఎంత ఎక్కువ ధరకు విక్రయాయించాలో నిర్ణయిస్తారు. మిగిలిన దుకాణాల వారు అదే ఫాలో అవుతారు. ఈ తంతు అంతా సజావుగా సాగడానికి లోకల్ సర్కిల్ నుంచి జిల్లా వరకు ఎక్సైజ్ అధికారులకు మాముళ్లు ముట్టజెబుతారు. ప్రతి నెలా అదేవిధంగా మాముళ్ల చెల్లిస్తూ ఉంటారు. ఇలా రెండేండ్ల పాటు కొనసాగుతుంది. ఇలా ఒక్కో వైన్ షాపు నుంచి లక్షల్లో వస్తూ చేస్తున్నారంటే సిండికేట్ దందా ఏ స్థాయిలో కొనసా గుతుందో ఇట్టే అర్థమవుతుంది. అయితే మందుబాబులు ఇదేమని ప్రశ్నిస్తే అప్పటవరకు ఏదో సర్దిచెప్పి పంపిస్తున్నారు. ఎవరైనా గట్టిగా నిలదీస్తే వారికి మాత్రం ఎమ్మార్పీ ధరలకు అమ్ముతున్నారు.

**ఎక్కడెక్కడ ఎంతంటే..** ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా మండల షాపుల్లో సిండికేట్ అయి దందా నడిపిస్తున్నారు. నర్వ. అమరచింత, రాజాపూర్, అడ్డాకుల, దోమలపెంట మండలాలతోపాటు ఇలా చాలా చోట్ల మండల కేంద్రాల్లోని దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటారు. అమరచింతలో క్వార్టర్‌పై కూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.10, ఫుల్ మీద రూ.20 ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అడ్డాకులలో క్వార్టర్‌పై రూ.5, ఆఫ్ బాటిల్ రూ.5, ఫుల్ బాటిల్ మద్యంపై రూ.10 అధికంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నర్వ రెండు మద్యం దుకాణాలు ఉండగా అన్ని బాటిళ్లపై ఎమ్మర్పీ కంటే రూ.5 అధికంగా విక్రయిస్తున్నారు. రాజాపూర్‌లో రెండు మద్యం దుకాణాలు ఉండగా రెండు ఒకే దగ్గర ఏర్పాటు చేసి రూ.5 అధికంగా అమ్ముతున్నారు. అయితే తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ అధికారుల వాహనాలకు డీజిల్‌తో సహా కొంత మొత్తాన్ని ముట్టజెప్పడం గత కొంత కాలంగానడుస్తూనే ఉన్నది.దీంతో తనిఖీలు షరా మాములే అంటున్నారు. అయితే వీటికితోడు ప్రతి నెలాకొంత మొత్తం ఎక్సైజ్ శాఖకు అధికారులు, వాళ్ల స్థాయిని బట్టి అందుతుండడంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

## వరి పంటలను పరిశీలించిన ఏఓ

**పెబ్బేరు,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పంటలను సోమ వారం మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు కాండంతొలుచు పురుగు ఆశించి ందని,సూక్ష్మదాతు పోషకాలలోపం ఉందన్నారు.వరి పంటకు పిలకదశలో కాండంతొలుచు ఆశించినప్పుడు వరి మొదల్లు సులువుగా ఊడొస్తుందని తెలిపారు.దీన్నితీవ్రత ఎక్కువగా ఉంటే కంకి దశలో తెల్ల కంకులు ఏర్పడతాయని సూచించారు. కాండం తొలు చుపురుగు నివారణ ప్రక్రియలో భాగంగా ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లో రైడ్4జీ 8కేజీలు,క్లోరాన్‌ట్రనిలిప్రోల్ గుళికలు ఎకరాకునాలుగు కేజీల చొప్పున 20 కేజీల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు.పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటేపై వాటితో పాటు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లో రైడ్ 50 శాతం 400 గ్రాములు 200 లీటర్లనీటిలో కలిపి స్ప్రే చేయాలని రైతులకు సూచించారు.సూక్ష్మదాతు లోప నివారణకు 250 గ్రాముల 20.20.20,అగ్రిమాక్స్ ప్రో 500 గ్రామలను పది రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేసుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలోఏఈఓ నరేష్,గ్రామ రైతులు బాలరాజు గౌడ్,వెంకట స్వామి,బలరాం రైతులు పాల్గొన్నారు.

## సమాచార శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి12, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లిన సమాచార శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ చేరుకున్న ఆయనను తోటి సిబ్బందితో ఆప్యాయంగా పలుకరించారు. ఉద్యోగంలో బదిలీలు సాధారమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచారం, పౌర సంబంధాలు ఉపకార నిర్వహక సమాచార ఇంజినీర్ కార్యాలయ ఉద్యో గులు వీడ్కోలు పలికారు.1997 డిసెంబర్‌లో 2005 వరకు ఏఈపీఆర్ పని చేసి, తదనంతరం డివిజనల్ పీఆర్‌వోగా ప్రమోషన్ పొందారు. 2014 నుంచి 2016 మార్చి వరకు హైదరాబాద్‌లో పని చేశారు. 2016అక్టోబర్ నుంచి జూన్ 2020వరకు వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు డీపీఆర్‌వోగా విధులు నిర్వర్తించారు. 2020జూన్‌లో మహబూబ్‌నగర్‌కు సమాచారా శాఖ సహాయ సంచాలకులుగా వచ్చారు. నోడల్ ఆఫీసర్‌గా ఉమ్మడి పాల మూరులోని అయిదు జిల్లాలో పని చేసిన అనుభవం ఉన్నది.

## రాజాపూర్‌లో దొంగల హల్‌చల్

### పోలీసులకు ఫిర్యాదు చేసిన మేనేజర్

**రాజాపూర్,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీరామ ఆటో ఫైనాన్స్‌లో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రాజాపూర్ మండల కేంద్రలోని ముఖ్య కూడలిలో గల శ్రీరామ టో ఫైనాన్స్‌లో ఆదివారం రాత్రి దొంగలు సెట్టర్ తాళాలు పగలకొట్టి బీరువా బద్దలుకొట్టి అందులో గలనగదు దోచుకెళ్లినట్లు ఫైనాన్స్ మేనేజర్ కర్ణాకర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి

**అలంపూర్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఐదవశక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాల యాలను ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి సోమవారం ద ర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వ హించారు.ఆయనకు అర్చకులు,ఈవోపురేందర్‌కుమార్ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి శేషవస్త్రం బహుకరించారు.అనిల్‌రావిపూడి పటాస్,సరిలేరు నీకెవ్వరు,ఎఫ్2,భగవం త్ కేసరి వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు.

## కౌకుంట్ల గోశాలకు విరాళం

**దేవరకద్ర,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కౌ కుంట్లలోని గోశాలకు సోమవారం ఓ గోప్రే మికుడు విరాళాన్ని అందజేశారు.వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన గోప్రేమికుడు బండారు బాలకృష్ణ రూ.10 వేల నగదు విరాళాన్ని శ్రీలక్ష్మీ గోశాలకు అంద జేయాలని నిర్ణయించారు.అందులో భాగం గాను గోశాలనిర్వహకులకు అట్టి విరాళాన్ని ఆయన అందజే శారు.ఈ సందర్భంగా బాలకృష్ణను గోశాల నిర్వహకులతో పాటు గ్రామస్థులు అభినందించారు.

## ఆటోయూనియన్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**దేవరకద్ర,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం మండలంలోని శ్రీ వీరగురు ఆటోయూనియన్ సభ్యులకు యం పీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఆటో యూనియన్‌గౌరవ అధ్యక్షుడుశ్రీకాంత్‌యాదవ్, అధ్యక్షుడు కుర్వ రాముల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు రాము మాట్లాడుతూ యూనియన్‌లో దాదాపు 200కు పైగా సభ్యులున్నారన్నారు.అందరికి గుర్తింపు కార్డులను అందజేస్తామ న్నారు.ఈకార్యక్రమంలో ఆటోయూనియన్ సభ్యులు మల్లేశ్,శ్రీని వాసులు,చెన్నారెడ్డి,రాజు,బందిగౌడ్ పాల్గొన్నారు.

## అచ్చంపేట మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్‌పై దాడిని ఖండించిన బిఆర్ఎస్ నాయకులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** అచ్చంపేట మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ అరుణపై ఆదివారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన దాడిని మండల బిఆర్ఎస్ నాయ కులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వమే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తే ఈ సంఘటన జరిగేది కాదని అచ్చంపేట పాలశీత లీకరణ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న ట్రేడర్స్ కుమ్మక్కై రైతులకు అన్యాయం జరిగిందని భావిం చి దాడి చేయడం జరిగిందని, ఒక మహిళా ఛైర్‌పర్సన్ అని కూ డా చూడకుండా ఆమెపై భౌతిక దాడులు చేయడం సరైంది కాద న్నారు. ఇది ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే దాడి జరిగిందని, ప్ర జాపాలన పేరు చెప్పి ప్రజలకు నమ్మించి మోసం చేస్తున్నారన్నా రు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర క ల్పిస్తూ, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ బలుస అరుణమ్మపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మేడమోని శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు పాత్కుల కురుమయ్య, ఎల్లయ్య యాదవ్, చిన్నజంగయ్య, సిహెచ్ సుధాకర్, సిహెచ్ మల్లయ్య, బాలస్వామి, బొల్లె మల్ల య్య, తాండ్ర శేఖర్ పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిల్లాలో వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌కు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందిచారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ జిల్లాలో ఏ మార్కెట్‌లో కూడా రైతాంగానికి గిట్టుబాటు ధర రావడం లేదని,ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలనిడిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో కమిషన్ దారులు, ట్రేడర్స్ మార్కెట్ అధికారులతో కుమ్మక్కై ధరలను నియంత్రిస్తున్నారని, అందువల్లే రైతాంగానికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని మార్కెట్ యార్డ్‌లను సందర్శించి రైతాంగాన్ని ఆదుకోవాలని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో ధర లేకపోతే రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని, వీటిని జిల్లా కలెక్టర్ నివారించాలన్నారు.వినతి పత్రం అందించిన వారిలో ఆర్.శ్రీనివాస్, కే.గీత, జిల్లా నాయకులు అశోక్‌లు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దివిటిపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.కురుమూర్తి సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలోని 25 కాలనీ 664 నంబర్ వరుసలో నెల రోజుల నుంచి మంచినీళ్లు రాక కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాలనీలోని మంచినీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం చేయలేదని చెప్పారు. కొన్ని కాలనీలో మాత్రమే నీళ్లు వస్తున్నా, ఎత్తుగా ఉన్న ప్రాంతంలో మంచినీళ్లు రావడం లేదని వివరించారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు దివిటిపల్లి రైల్వే స్టేషన్ నుండి డబుల్ రూమ్‌లోకి వెళ్లేదారి పూర్తిగా గుంతలు పడిందని ఫలితంగా దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రోడ్డు పునరుద్ధరణ చేయాలని రైల్వే వంతెన కింద లైట్లు అమర్చాలని కోరారు.